రూపుదిద్దుకుంటున్న జగనన్న కాలనీలు

- గృహ నిర్మాణాలు వేగవంతం
- గ్రామాలకు కొత్త రూపు

ఉంగుటూరు: మండలంలో గృహ నిర్మాణ పనులు వేగవంతమయ్యాయి. జగనన్న కాలనీలు గ్రామాల్లో రూపుదిద్దుకుంటున్నాయి. దీంతో గ్రామాలు కొత్తరూపు సంతరించుకుంటున్నాయి. ఉంగుటూరు మండలంలో 2,664 ఇళ్లు మంజూరయ్యా యి. 1,898 లబ్ధిదారులు ముందుకువచ్చి ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించారు. ఉంగుటూరు, చేబ్రోలు, కైకరం, నాచుగుంట నాలుగు కాలనీల్లో ఆర్చిల నిర్మాణాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఒక్కొక్కటి రూ.4.15 లక్షల వ్యయంతో వీటిని నిర్మించనున్నారు.

చూడముచ్చటగా కాలనీలు

ఇప్పటి వరకు 1,331 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేశారు. రూపుదిద్దుకున్న ఇళ్ల నిర్మాణాలతో కాలనీలు ఎంతో చూడ ముచ్చటగా కనిపిస్తున్నాయి. 600 ఇళ్ల నిర్మాణాలు వివిధ స్థాయిల్లో ఉన్నాయి. 1,659 ఇళ్ల లబ్ధిదారులు గృహ ప్రవేశాలకు సిద్ధమయ్యారు. వచ్చే ఉగాది నాటికి భారీస్థాయిలో కాలనీల్లో గృహ ప్రవేశాలకు సన్నాహాలు చేస్తున్నారు. చేబ్రోలులో 202 ఇళ్ల నిర్మాణాలు పూర్తవడంతో అదొక కొత్త ఊరుగా కనిపిస్తోంది. కైకరంలో 143 ఇళ్ల నిర్మాణాలు, వెల్లమిల్లిలో 137, నాచుగుంటలో 75, బొమ్మిడిలో 65, బాదంపూడిలో 42, గోపినాథపట్నంలో 51, ఉప్పాకపాడులో 53, నీలాద్రిపురంలో 66, ఎ.గోకవరంలో 88, ఉంగుటూరులో 101 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి.

నిర్మాణ సామగ్రి ఉంచేందుకు గోడౌన్లు ఏర్పాటు

తహసీల్దారు వెంకటరమణ, ఎంపీడీవో ప్రేమాన్విత, హౌసింగు ఏఈ సురేష్ బాబు, క్లస్టరు అధికార్లుగా మండలంలో పెద్దమెత్తంలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయడానికి కృషి చేస్తున్నారు. వీరికి గ్రామస్థాయిలో సచివాలయ ఇంజనీరింగ్, స్థానిక ప్రజాప్రతినిధులు సహకరిస్తున్నారు. గృహాలు వేగవంతంగా పూర్తయ్యేందుకు మండలంలోని ప్రజాప్రతినిధులు లబ్ధిదారులను ప్రోత్సహిస్తున్నారు. లబ్ధిదారులకు ఉపయోగపడేలా నిర్మాణ సామగ్రిని ఉంచేందుకు మండలంలోనే గోడౌన్లు ఏర్పాట్లు చేసారు. దాంతో లబ్ధిదారులకు రవాణా ఛార్జీలు కలిసి వచ్చాయి. చేబ్రోలు, ఉంగుటూరు, బొమ్మిడి, నల్లమాడు, గోపినాథపట్నం, నాచుగంట ప్రాంతాల్లో సిమెంటు, ఐరన్, ఇసుక గోడౌన్లు ఏర్పాటు చేశారు. బిల్లులు త్వరితగతిన విడుదల చేయడంతో లబ్ధిదారులు వేగంగా నిర్మాణాలు పూర్తి చేస్తున్నారు.

మెరక పనులకు ఎమ్మెల్యే నిధులు

ఉంగుటూరు, చేబ్రోలు, కైకరంలో లేఅవుట్లు పొలాల్లో ఏర్పాటు చేయడంతో ముంపు సమస్య తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యగా ఎమ్మెల్యే వాసుబాబు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నిధులు మంజూరు చేసి మెరకు పనులు పూర్తి చేశారు. కాలనీల్లో అంతర్గత రహదార్ల నిర్మాణాలకు విద్యుత్ సదుపాయం సమకూర్చడంతో కాలనీలు విద్యుత్ కాంతులతో వెలిగిపోతున్నాయి. కాలనీల్లో డ్రైయిన్ల నిర్మాణాలు మూడింట రెండు వంతులు పూర్తి చేశారు.



చేబ్రోలు జగనన్న కాలనీలో నిర్మించిన గృహాలు



బొమ్మిడిలో రూపుదిద్దుకుంటున్న జగనన్న కాలనీ

లబ్ధిదారులకు సహకరించాం



లబ్దిదారులకు ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వ యంత్రాంగమంతా ఎంతగానో సహకరించాం. ఆర్థిక లేమితో ఇబ్బంది పడే లబ్ధిదారులకు స్వయం సహాయక గ్రూపు ద్వారా మరో రూ.35 వేల నిధులు మంజూరు చేయించాం. ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయడానికి సహకరించాం. నిర్మాణ సామగ్రి నాణ్యత కలిగినవి తక్కువ ధరకు అబ్ధిదారులకు అందించాం. త్వరలోనే కాలనీలు ప్రారంభింపజేయడానికి సిద్ధం చేస్తున్నాం.

– సురేష్‌బాబు, హౌసింగు ఏఈ, ఉంగుటూరు

సీఎం జగన్ వల్ల మేం ఇల్లు నిర్మించగలిగాం



సీఎం జగన్, ఎమ్మెల్యే వాసుబాబు దయ వల్ల మేం ఇల్లు కట్టుకోగలిగాం. సకాలంలో ఇళ్ల నిర్మాణాలకు ముందస్తుగానే తక్కువ ధరకు మెటీరియల్ అందించారు. కాలనీలో విద్యుత్ సదుపాయం, మంచి నీటి సదుపాయం కల్పించారు. ప్రభుత్వం ఇళ్ల నిర్మాణానికి అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తోంది. సొంతిల్లు సాకారమవుతుందని కలలో కూడా ఊహించలేదు. నేడు మాకల నెరవేరినందుకు సంతోషంగా ఉంది.

– యర్ర సత్యవతి, బొమ్మిడి, గృహనిర్మాణ లబ్ధిదారు

జగనన్న కాలనీకి విద్యుత్ సౌకర్యం



అలుగులగూడెం జగనన్న కాలనీకి విద్యుత్ స్తంభాలు, కరెంటు సౌకర్యం కల్పిస్తున్న దృశ్యం

దెందులూరు: అలుగులగూడెంలో జగనన్న కాలనీలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆదేశాల మేరకు యుద్ధప్రాతిపదికన విద్యుత్ స్తంభాలు, విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేస్తున్నారు. పనులను దెందులూరు మండల పార్టీ అధ్యక్షుడు కామిరెడ్డి నాని, వైఎస్సార్ సీపీ గ్రామ దెందులూరు అధ్యక్షుడు పోకల రాంబాబు, అలుగులగూడెం వార్డు మెంబరు కాండ్రు ప్రసన్న, వైఎస్సార్ సీపీ నాయకులు రవి, స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జగనన్న ఇళ్లు త్వరితగతిన పూర్తి చేయాలని, కాలనీలోని లబ్ధిదారులకు రోడ్లు, తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని పోకల రాంబాబు వివరించారు.

సీహెచ్‌సీలో ఆకస్మిక తనిఖీ

దెందులూరు: దెందులూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను శుక్రవారం డీసీహెచ్ఎస్ డాక్టర్ ఏవీఆర్ మోహన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యశాలలో పనిచేసే వైద్యులు సాయంత్రం నుంచి రాత్రి వేళల్లో విధులు నిర్వహించడంలేదని గతంలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆగ్రహం వ్యక్తం చేసి డీఎంఅండ్‌హెచ్‌ఓ, కలెక్టర్‌కు తెలిపిన సంగతి విదితమే. ఇటీవల వైద్యులు రాత్రివేళల్లో విధులకు రావడం లేదని, స్టాఫ్ నర్సులు మాత్రమే ఉంటున్నారని గ్రామస్తులు తెలిపారు. ఈ నేపథ్యంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ ఏవీఆర్ మోహన్ వైద్యులు, వైద్యశాలలో సిబ్బంది, హాజరు శాతం, వైద్యపరికరాలు, మందులు, తాగునీరు, విద్యుత్, శానిటేషన్, నూతన సీహెచ్‌సీ భవనాన్ని పరిశీలించారు.

క్లుప్తంగా

సమస్యల పరిష్కారానికి కృషి



ఎంపీ కార్యాలయంలో ఎంపీ కోటగిరి శ్రీధర్‌ను కలిసి మాట్లాడుతున్న వెలమ సంఘ నేతలు

దెందులూరు: వెలమ సంఘ సమస్యలు పరిష్కారానికి తన వంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ అన్నారు. శుక్రవారం ఎంపీ కార్యాలయంలో చింతలపూడి నియోజకవర్గ వెలమ సంఘ నాయకులు వైఎస్సార్ సీపీ నాయకులు రాజేష్ ఆధ్వర్యంలో ఎంపీని కలిశారు. వెలమలు, సంఘ సమస్యలు వివరించారు. ఎంపీ మాట్లాడుతూ ప్రాధాన్యతా క్రమంలో సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

ఏప్రిల్ 3న మహా ధర్నా

భీమడోలు: ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్న బీజేపీ ప్రభుత్వంపై మాదిగలు మరో యుద్ధానికి సిద్ధం కావాలని ఎంఆర్‌పీఎస్ జిల్లా సీనియర్ నాయకులు కొత్తపల్లి చంద్రమౌళి భీమడోలులో శుక్రవారం అన్నారు. వచ్చే నెల 3న విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయం వద్ద మహా ధర్నా, 4న విజయవాడ ముట్టడి కార్యక్రమాన్ని చేపడుతున్నందున మాదిగ ప్రజలంతా వేలాదిగా తరలిరావాలని ఆయన కోరారు.

17న విగ్రహ ప్రతిష్ఠ



సానిగూడెంలోని నూతన అభయాంజనేయస్వామి ఆలయం

దెందులూరు: సానిగూడెంలోని నూతనంగా నిర్మించిన అభయాంజనేయస్వామి ఆలయంలో ఈ నెల 17న ఆలయ ప్రారంభోత్సవం, స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ జరుగుతుందని ఆలయ నిర్వాహకులు శ్రీనివాసరావు తెలిపారు. విగ్రహ ప్రతిష్ఠ అనంతరం పూజలు, అన్నదానం కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

గర్భిణులు ఆరోగ్య నియమాలు పాటించాలి

గణపవరం: గర్భిణీ మహిళలు వైద్య సిబ్బంది సూచించిన విధంగా పౌష్టికాహారం తీసుకుంటూ ఆరోగ్య నియమాలు పాటించాలని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారి సంతోష్‌నాయుడు అన్నారు. శుక్రవారం గణపవరం పీహెచ్‌సీలో గర్భిణులకు ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ప్రతి నెలా 9, 10 తేదీల్లో పీహెచ్‌సీలో గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి సురక్ష మాతృత్వ యోజన కార్యక్రమంలో 70 మంది గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. తాడేపల్లిగూడెం ఏరియా ఆస్పత్రి పంపించనున్నట్లు తెలిపారు. సీహెచ్‌వో జాలాది విల్సన్, పీహెచ్ఎన్ జి.వరలక్ష్మి పాల్గొన్నారు.

శాస్త్రవేత్తల క్షేత్ర పరిశీలన



దెందులూరు పొలంలో క్షేత్ర పరిశీలన చేస్తున్న శాస్త్రవేత్తలు, శిక్షణ పొందుతున్న విద్యార్థులు

దెందులూరు: వరిలో ద్రవ రూప జీవన ఎరువులపై రైతులు వ్యవసాయ శాఖ సలహాలు, సూచనలు పాటించాలని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ ఫణికుమార్, ఎన్.నాగేంద్రబాబు అన్నారు. శుక్రవారం ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ కళాశాల విద్యార్థినులు డీ.భావన, ఎం.శ్వేత, పీ.ప్రమీల, ఎం.లక్ష్మి ఆధ్వర్యంలో ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు క్షేత్ర పరిశీలన చేశారు. ద్రవ రూప జీవన ఎరువులు వేసిన ఎంటీయూ 1121 రకంలో పంట పెరుగుదలను గమనించాలన్నారు. అనంతరం వరి సాగు ఎరువులు, పురుగు మందుల వాడకం, భూసార పరిరక్షణ, వ్యవసాయ శాఖ సలహాలు, సూచనలను అందించారు.

కడుపు నొప్పి తాళలేక ఇద్దరు ఆత్మహత్య

దెందులూరు: కడుపునొప్పి తాళలేక ఇద్దరు ఆత్మహత్య చేసుకుని మృతి చెందారని దెందులూరు ఎస్సై ఐ.వీర్రాజు తెలిపారు. కొవ్వలి గ్రామంలో కొమ్మన్నవారితోట సచివాలయం -1 వలంటీర్ మన్నే రాము (27) కడుపునొప్పి తాళలేక శుక్రవారం ఇంట్లో ఫ్యాన్‌కి ఉరి వేసుకున్నాడన్నారు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు రామును ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లడంతో అప్పటికే మరణించినట్టు వైద్యులు చెప్పారు. మృతి చెందిన వలంటీర్ మన్నే రాముకు ఆదివారం వివాహం జరగాల్సి ఉంది. రెండు రోజులు ముందు ఇలా జరగడంతో కుటుంబ సభ్యులు, బంధువులు, సచివాలయ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. మసీదుపాడు గ్రామానికి చెందిన సాయిబోయి కృష్ణమోహన్ (35) కడుపునొప్పి తాళలేక ఉరి వేసుకుని శుక్రవారం సాయంత్రం మృతి చెందాడన్నారు. మృతుడికి వివాహమైంది. వ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడని ఎస్సై వీర్రాజు తెలిపారు.

పార్టీ ఆవిర్భావ దినోత్సవం వైభవంగా నిర్వహించాలి

దెందులూరు: నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఈ నెల 12న ఘనంగా నిర్వహించాలని నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు, ముఖ్యనాయకులను, ప్రజాప్రతినిధులను ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆదేశించారు. శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే కార్యాలయంలో నియోజకవర్గ ప్రజాప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులకు జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు పూర్తి సహాయ సహకారాలు అందించాలన్నారు. 12న పార్టీ ఆవిర్భావ దినోత్సవం నియోజకవర్గంలో ప్రతి గ్రామ శివారు ప్రాంతాల్లో విధిగా ఆవిర్భావ దినోత్సవం ఎన్నికల నిబంధనలకు లోబడి నిర్వహించాలన్నారు. ఆవిర్భావ దినోత్సవం విధిగా నిర్వహించడానికి మండల పార్టీ అధ్యక్షులు, గ్రామ పార్టీ అధ్యక్షుల సమన్వయంతో నిర్వహించాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి త్వరలో దెందులూరు నియోజకవర్గంలో రోడ్లు, లిఫ్ట్ ఇరిగేషన్, వైద్యశాల, ఇతర అభివృద్ధి పనుల నిమిత్తం విచ్చేస్తారన్నారు. నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో ఆవిర్భావ దినోత్సవం, పార్టీ కమిటీల నియామకంలో చిత్తశుద్ధి, ప్రణాళికతో పనిచేయాలన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి జానంపేట బాబు, విజయవాడ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయ ట్రస్టు బోర్డు డైరెక్టర్ తొత్తడి వేదకుమారి, జెడ్పీ వైస్ చైర్మన్ పెనుమాల విజయ్ బాబు, దెందులూరు మాజీ ఏఎంసీ చైర్మన్ మేకా లక్ష్మణరావు, జెడ్పీటీసీలు నిట్టా లీలానవకాంతం, గంటా పద్మశ్రీ, మండలి సరస్వతి, ఎంపీపీలు తాతా రమ్య, బొమ్మనబోయిన సుమలత, బత్తుల రత్నకుమారి, పెన్మెత్స శ్రీనివాస్, రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్లు పళ్ళెం ప్రసాద్, ముదునూరి సూర్యనారాయణ, ప్రభాకరరావు, మండలి కొండలరావు, నాలుగు మండలాల పార్టీ అధ్యక్షుడు కామిరెడ్డి నాని, తేరా ఆనంద్, మెట్లపల్లి సూరిబాబు, అప్పన ప్రసాద్, నియోజకవర్గంలో ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



దెందులూరులో నియోజకవర్గం నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

ఉత్తమ సమాజ స్థాపనే మానవత లక్ష్యం

భీమడోలు: ఉత్తమ సమాజ స్థాపనే మానవత స్వచ్ఛంద సేవా సంస్థ లక్ష్యమని ఉమ్మడి జిల్లాల మానవత అధ్యక్షుడు రామిశెట్టి గంగాధరరావు అన్నారు. కురెళ్లగూడెం రైతు భరోసా కేంద్రం వద్ద శుక్రవారం మానవత మండల శాఖ ఆధ్వర్యంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం, రక్త గ్రూపు నిర్ధారణ శిబిరాలను నిర్వహించారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ గుడివాడ నాగగౌతమి సీతారామాంజనేయులు ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభకు మండల అధ్యక్షుడు పచ్చా వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా గంగాధరరావు హాజరయ్యారు. అనంతరం వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి ఆసుపత్రి వైద్యులతో సుమారు 150 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో 41 మందికి కళ్లజోళ్లు, 12 మంది ఆపరేషన్లు చేయాలని నిర్ధారించారు. భీమడోలుకు చెందిన రెయిన్‌బో యాజమాన్యం గ్రామంలోని 130 మందికి రక్త గ్రూపు నిర్ధారణ పరీక్షలు చేసారు. గత నెలలో పూళ్ల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ముగ్గురు కుటుంబ సభ్యులు, క్షతగాత్రుడి కుటుంబానికి, ఓ వికలాంగురాలి కుటుంబానికి ఒక్కొక్కరికి 25 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. భీమడోలు వైసీపీ నేత, సాయిరామ్ క్లాత్ షోరూమ్ అధినేత పున్నం గోపి వారికి నూతన వస్త్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో శాంతిరథాల కమిటి చైర్మన్ అప్పక రాంబాబు, కురెళ్లగూడెం ప్రతినిధులు ఉప్పు రమణమూర్తి, ఉప్పలపాటి సత్యసాయికృష్ణ, పాలకుర్తి కృష్ణ, మండల చైర్మన్ గుల్ల నూకరాజు, కోశాధికారి గుల్ల అప్పారావు, జిల్లా కెరీర్ గైడెన్స్ డైరెక్టర్ తుమ్మల ఉమామహేశ్వరరావు, మాజీ మండల అధ్యక్షుడు ఉన్నమట్ల సత్యనారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.



కురెళ్లగూడెంలో నిత్యావసర సరుకులు అందిస్తున్న రామిశెట్టి గంగాధరరావు, అప్పక రాంబాబు

గృహసారథులకు బృహత్తర బాధ్యతలు

భీమడోలు: ప్రభుత్వానికి, ప్రజలకు గృహసారథులు, సచివాలయాల కన్వీనర్లు వారధులుగా సమర్థవంతంగా పని చేసి వైఎస్సార్ సీపీ మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు యుద్ధ సైనికుల్లా పని చేయాలని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. భీమడోలు వీసీ కన్వెన్షన్ హాల్‌లో శుక్రవారం రాత్రి భీమడోలు, పోలసానిపల్లి, అంబర్‌పేట, సూరప్పగూడెం గ్రామాల్లోని గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లుతో ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. అధ్యక్షత వహించిన వాసుబాబు మాట్లాడుతూ మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంపై వారికి దిశానిర్దేశం చేసారు. రాష్ట్ర చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా సంక్షేమం, అభివృద్ధి పథకాలను అమలు చేస్తూ ప్రజల గుండెల్లో సుస్థిర స్థానాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పొందారన్నారు. ఆ పథకాలన్నీ పేదలకు సక్రమంగా అందుతున్నదీ లేనిదీ పరిశీలించి లోపాలుంటే ప్రభుత్వానికి తెలియజేయాల్సిన బృహత్తర బాధ్యత గృహ సారథులపై ఉందన్నారు. ప్రతిపక్షాలు విషపు ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు గృహ సారథులు ప్రజలను చైతన్యంగా చేయాలన్నారు. వలంటీర్లు, గృహసారథులు సమన్వయ పర్చుకుని ప్రభుత్వానికి, ప్రజలకు వారధులుగా పని చేయాలన్నారు. మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షురాలు పాము సునీతామాన్‌సింగ్, జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ, ఏఎంసీ చైర్మన్ ఇంజేటి నీలిమజూనియర్, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు మద్దుల ఫణిపద్మజరాజా, దోకల వాసంతి, మండల వైసీపీ కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, సర్పంచులు షేక్ రహీమాబేగం హసీనా, వెజ్జు బాలాజీ, రాష్ట్ర కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



భీమడోలులో ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు



హాజరైన గృహసారథులు, కన్వీనర్లు, పార్టీ శ్రేణులు

నులి పురుగు నివారణపై పోస్టర్ ఆవిష్కరణ

ఉంగుటూరు: చిన్నపిల్లల్లో నులిపురుగు నివారణకు ఆల్‌బెండజోల్ మాత్రలు అందజేస్తామని మండల పీహెచ్‌సీ వైద్యుడు సుబరాజు వర్మ తెలిపారు. శుక్రవారం ఉంగుటూరు ఎంపీడీవో కార్యాలయం వద్ద నులిపురుగు మందు పంపిణీ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఇన్‌ఛార్జి ఎంపీడీవో ఆంజనేయులు, చేబ్రోలు పీహెచ్‌సీ డాక్టరు సుబ్బరాజు వర్మ, ఎంఈవో లక్ష్మీనారాయణ, ఈవోపీఆర్డీ షంషుద్దీన్, కాగుపాడు వైద్యులు శ్రావణ్‌రెడ్డి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

అల్బెండజోల్ మాత్రల పంపిణీ

పెదపాడు: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బాలబాలికలకు అల్బెండజోల్ మాత్రలు అందించాలని పెదపాడు ఎంపీడీవో ఎస్ నిర్మలజ్యోతి తెలిపారు. పెదపాడు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆరోగ్య కార్యకర్తలు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలకు సమావేశం నిర్వహించి వారికి అవగాహన కల్పించారు. 1 నుంచి 19 ఏళ్లలోపు బాల బాలికలందరికీ నులిపురుగుల మందును వేయాలన్నారు. మండలంలో 14వేల మందికి నులిపురుగుల మందు అందిస్తున్నామన్నారు. పెదపాడు సీడీపీఓ ఎం సునీల్ రాజశేఖర్, ప్రాధమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు చక్రధర్, రవితేజ పాల్గొన్నారు.



నులి పురుగు నివారణపై పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మండల అధికార్లు

14 నుంచి అల్బెండజోల్ మాత్రల పంపిణీ

దెందులూరు: జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం ఈ నెల14 నుంచి నిర్వహించనున్నట్టు గోపన్నపాలెం, పోతునూరు వైద్యాధికారులు తెలిపారు. 1 నుంచి 19 ఏళ్లు వయస్సు ఉన్న వారికి అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తామన్నారు. అంగన్‌వాడీలు, పాఠశాలలు, కళాశాలల్లో ఉచితంగా వీటిని అందిస్తామన్నారు. ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు, నులిపురుగుల మాత్రల పంపిణీపై మరింత అవగాహన కల్పించాలన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

గణపవరం: అన్ని రకాల అంటువ్యాధులకు మూలం దోమలు, అపరిశుభ్రతేనని, పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యం చేకూరుతుందని తాడేపల్లిగూడెం డివిజన్ మలేరియా అధికారి వైవీ లక్ష్మణరావు అన్నారు. శుక్రవారం గణపవరం మండలం సరిపల్లెలో ఆయన వైద్య సిబ్బందితో కలిసి అంటువ్యాధులు, దోమల నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి అపరిశుభ్రత, దోమల వ్యాప్తి, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఇళ్ల పరిసరాల్లోని మురుగు నీటి కుంటల్లో పెరుగుతున్న దోమలు, లార్వాలను చూపించారు. ప్రస్తుతం డెంగీ, టైఫాయిడ్, మలేరియా వంటి వ్యాధులు ఎక్కువగా వ్యాపిస్తున్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఇంటింటికీ కరపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో విల్సన్, ఆరోగ్య సహాయకుడు యోహాన్ పాల్గొన్నారు.

కాశిపాడులో..

ప్రజలు వ్యాధుల బారిన పడకుండా తగు రక్షణ చర్యలు తీసుకోవాలని వైద్యసిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. శుక్రవారం పిప్పర పీహెచ్‌సీ పరిధిలోని కాశిపాడు, చిలకంపాడులో ఆరోగ్య అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఆరోగ్య సహాయకుడు నామాలరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

టోల్ గేట్ వద్ద వాహనాల తనిఖీ

పెదపాడు: శాసన మండలి ఎన్నికల నేపథ్యంలో పెదపాడు పోలీసులు శుక్రవారం వాహన తనిఖీలు చేపట్టారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పెదపాడు మండలంలోని కలపర్రు టోల్‌గేట్ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఎన్నికల నేపథ్యంలో ఎవరైనా నగదు రవాణా చేస్తే సంబంధిత నగదుకు ఆరా చూపించాలన్నారు. ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు నగదు, మద్యం, ఏ ఇతర పనులు సరఫరా చేయరాదన్నారు. అలా ఎవరైనా సరఫరా చేస్తే ఎన్నికల చట్టం ప్రకారం కేసు నమోదు చేస్తామని పోలీసలు హెచ్చరించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

నిడమర్రు: పెదనిండ్రకొలను సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లోనూ, మండల కేంద్రం నిడమర్రులో శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ వెంకటేశ్వరరావు తెలిపారు. విద్యుత్ లైన్లు, సబ్‌స్టేషన్ నిర్వహణ. కొత్త విద్యుత్ లైన్లు స్తంభాల ఏర్పాటు నిమిత్తం సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు.

నేడు కన్వీనర్లు, గృహసారథుల ఆత్మీయ సమావేశం

భీమడోలు: గుండుగొలనులోని వైఎస్సార్ సీపీ పార్టీ కార్యాలయం వద్ద శనివారం ఉదయం 10 గంటలకు సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్ల ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్టు భీమడోలు వైసీపీ మండల కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు శుక్రవారం రాత్రి తెలిపారు. ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అధ్యక్షతన సమావేశాలు జరుగుతాయన్నారు. గుండుగొలను, కోరుకొల్లు, రత్నాపురం, గ్రామాల్లోని సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు విధిగా హాజరు కావాలని కోరారు. సాయంత్రం 4 గంటలకు ఆగడాలలంక పంచాయతీ కార్యాలయం వద్ద ఆగడాలలకం, చెట్టున్నపాడు, మల్లవారం గ్రామాల్లోని సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో సమావేశాన్ని నిర్వహిస్తారన్నారు. ప్రజాప్రతినిధులు, కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్లరు, అనుబంధ సంఘాల అధ్యక్షుడు హాజరు కావాలని వారు కోరారు. ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ఈ సమావేశాలల్లో వారికి దిశా నిర్ధేశకం చేస్తారన్నారు.

వాటర్ కూలర్ ప్రారంభం

పెదపాడు: వేసవిలో కార్యాలయ సందర్శకుల దాహార్తి తీర్చేందుకు వాటర్ కూలర్ ఎంతగానో ఉపయోగపడుతుందని పెదపాడు ఎంఈఓ సబ్బితి నర్సింహమూర్తి తెలిపారు. పెదపాడు మండల విద్యావనరుల కేంద్రంలో పెదపాడు గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు కట్నేని రమేష్ అందించిన వాటర్ కూలర్‌ను ఎంఈఓ సబ్బితి నర్సింహమూర్తి శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కట్నేని రమేష్, తోట ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీకి ట్రాక్టర్ వితరణ

దెందులూరు: గ్రామ శ్రేయస్సు కోసం గ్రామానికి చెందిన దాత పీ.రామ్మోహనరావు (బుజ్జి) కొత్త ట్రాక్టర్ ఇవ్వడం అభినందనీయమని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. శుక్రవారం దాత రామ్మోహనరావు గ్రామ పంచాయతీలో చెత్తను తీసుకువెళ్లేందుకు కొత్త ట్రాక్టర్‌ను పంచాయతీకి ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి చేతులు మీదుగా బహూకరించారు. జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం, ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత, వైస్ ఎంపీపీ వేమూరి జితేంద్ర, పార్టీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి కుమార్, ఎంపీటీసీలు ఏనుగు అంజలి ప్రసాద్, సువ్వా ప్రభుదాసు, పార్టీ నాయకులు కొండేటి గంగాధర్‌బాబు, తోట పద్మారావు, మోర్ల సుబ్బారావు, గ్రామ కార్యదర్శి యోహోషువా దాతను అభినందించి సత్కరించారు. అనంతరం మసీదుపాడులోని జగనన్న కాలనీని ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి పరిశీలించారు. త్వరితగతిన ప్రారంభించిన ఇళ్లు పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. మసీదుపాడు నుంచి జగనన్న కాలనీతో పాటు జగనన్న కాలనీలో రోడ్డు సౌకర్యం కల్పిస్తామన్నారు. ప్రారంభోత్సవాలు చేసిన లబ్ధిదారులకు నూతన వస్త్రాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.



గోపన్నపాలెం పంచాయతీకి ట్రాక్టర్ ఇచ్చిన దాత రామ్మోహనరావును అభినందిస్తున్న ఎమ్మెల్యే